

చిటారు కొమ్మన నెలవంక పూసింది

● చిత్తూరులో శుక్రవారం రాత్రి ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కిన దృశ్యం

ఏ పంచాయతీ నిధులు ఆ పంచాయతీలోనే ఖర్చు చేసేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వైసీపీ ప్రభుత్వంలా ఇతర అవసరాలకు నిధులు మళ్లించడం, పంచాయతీ ఖాతాలను స్తంభింపజేయడం మానేసి ఆర్థికసంఘం నిధులు వచ్చినవి వచ్చినట్లు జమ చేస్తుండడంతో పంచాయతీలకు మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయి.

సర్పంచుల సంబరం

- ●పంచాయతీల ఖాతాల్ని స్తంభింపజేసే విధానాలకు చెల్లుచీటీ
- ● గతంలో రూ.120 కోట్లను మళ్లించేసిన వైసీపీ ప్రభుత్వం
- ● కూటమి సర్కారు వచ్చాక జిల్లాకు రూ.29.24 కోట్లు విడుదల
- ● త్వరలో అందనున్న మరో విడత ఆర్థిక సంఘం నిధులు



చిత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 697 గ్రామ పంచాయతీలుండగా.. 684 చోట్ల ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పడ్డాయి. సర్పంచులు గెలిచినప్పటి నుంచీ ఖాతాల్లో నిధులు లేక, గ్రామాల్లో చిన్నపాటి పనులూ చేయలేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధుల్ని ఎప్పటికప్పుడు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించేసేది. ఇలా జిల్లాలో పలు విడతల్లో రూ.120 కోట్లను ఇతర అవసరాల పేరుతో మళ్లించేసింది. దీంతో సొంత డబ్బులు ఖర్చు చేసిన వారు బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విడతల వారీగా బిల్లులు మంజూరు చేస్తుండడంతో వారంతా ఊపిరి పీల్చుకుంటున్నారు.

● ఇప్పటికే రూ.29.24 కోట్లు జమ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీలకు మంచికాలం వచ్చింది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఈ క్రమంలో ఆగస్టు 22వ తేదీన జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.24 కోట్లు జమ చేశారు. ఈ మొత్తాన్ని పాలకవర్గాలున్న 684 గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేశారు. కొందరు సర్పంచులు పాత బిల్లుల్ని తీసుకుంటే, మరికొందరు పంచాయతీలో అభివృద్ధి పనులు చేసుకుంటున్నారు.మరో విడత నిధులూ త్వరలో జమ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు రూ.750 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధుల్ని త్వరలో జమ చేస్తున్నట్లు గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అమరావతిలో ప్రకటించారు.ఈ నిధుల్ని విడుదల చేస్తే జిల్లాకు మరో రూ.30 కోట్లు రావచ్చు. జనాభా ఆధారంగా ఈ నిధుల్ని పంచాయతీలకు సర్దుబాటు చేయనున్నారు.ఇప్పటికే జమయిన నిధులతో పెండింగ్ బిల్లులు క్లియర్ అవుతున్నాయి. దీంతో జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న వైసీపీ సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం విపక్షాలను భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకుంది.ప్రతిపక్షాల మద్దతుదారులను నామినేషన్లే వేయనీకుండా పెద్దఎత్తున సర్పంచులను, ఎంపీటీసీలను, జడ్పీటీసీలను, వార్డు కౌన్సిలర్లను గెలిపించుకుంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఉత్సవ విగ్రహాలుగా మారిన సర్పంచులు.. ఇప్పుడు ఖాతాల్లో జమయిన నిధులతో పనులు చేసుకుంటున్నారు. పంచాయతీ స్థాయిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్లను మంజూరు చేశారు. ఆ పనులు క్షేత్ర స్థాయిలో ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యత మొత్తం సర్పంచులకే అప్పగించారు.నిధుల కోసం రోడ్డెక్కి ధర్నా చేసే స్థాయి నుంచి గ్రామాల్లో రోడ్లను బాగు చేసుకునే స్థాయికి సర్పంచులు ఎదిగారు.

● కూటమి ప్రభుత్వంతో ధైర్యం



మా వైసీపీ ప్రభుత్వంలో మేమంతా డమ్మీలుగా ఉండేవాళ్లం. మాకు వచ్చిన ఆర్థికసంఘం నిధుల్ని కూడా ఎప్పటికప్పుడు మళ్లించేసేవారు. మా పంచాయతీలో సుమారు నాలుగు వేల ఓట్లున్నాయి. ఓ సారి రూ.33 లక్షలు విద్యుత్తు బిల్లుల పేరుతో, మరోసారి రూ.13.40 లక్షలు కారణం లేకుండా మళ్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక మా పంచాయతీకి రూ.2 వేలు తక్కువ రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పంచాయతీలో పనులు చేసుకోవచ్చన్న ధైర్యం వచ్చింది.

- రమేష్, కృష్ణాపురం సర్పంచి (వైసీపీ), వి.కోట మండలం



పెనుమూరు మండలంలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులు

● వైసీపీ లాగేసుకుంటే.. టీడీపీ ఇస్తోంది



నంజరపల్లె పంచాయతీలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల్ని కాదని స్వతంత్ర అభ్యర్థి అయినటువంటి నన్ను ఒక్క ఓటు తేడాతో ప్రజలు గెలిపించారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు ఇస్తుంది కాబట్టి పంచాయతీని అభివృద్ధి చేసుకుందాం అనుకున్నా వైసీపీ ప్రభుత్వం నిధుల్ని ఎప్పటికప్పుడు మళ్లించేసింది. సుమారు రూ.5 లక్షల నిధుల్ని లాగేసింది. కూటమి ప్రభుత్వం వస్తానే రూ.1.60 లక్షల నిధులు జమయ్యాయి. ఇక పనులు చేసుకుంటాం.

-ఊహ, నంజరపల్లె సర్పంచి, పెనుమూరు మండలం

● మాకు సర్వాధికారాలు వచ్చాయి



వైసీపీ ప్రభుత్వం పలు విడతల్లో మా పంచాయతీకి కేంద్రం ఇచ్చిన నిధుల్ని రూ.16.40 లక్షల వరకు మళ్లించేసింది. చిన్న చిన్న పనులు కూడా చేసే పరిస్థితి ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రూ.5.40 లక్షల్ని మంజూరు చేసింది. ఆ నిధుల్ని పంచాయతీ అభివృద్ధితో పాటు, మరమ్మతులకు వాడుకుంటాం. దీంతో పాటు మా పంచాయతీలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనుల పర్యవేక్షణ బాధ్యత కూడా మాకే ఇచ్చారు.

- భగవతి, ఓటివారిపల్లె సర్పంచి (టీడీపీ), యాదమరి మండలం

ఇద్దరు టీచర్లకు ఉర్దూ అకాడమీ అవార్డులు



పి.మహమ్మద్ అలీ



కె.మాలిక్ మోహిద్దీన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి అవార్డులకు జిల్లా నుంచీ ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వి.కోట మండలం జడ్పీ ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పి.మహమ్మద్ అలీ, పెనుమూరు మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ కె.మాలిక్ మోహిద్దీన్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. మైనారిటీ దినోత్సవ సందర్భంగా సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉర్దూ అకాడమీ నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేయనున్నారు.

చిత్తూరు పార్లమెంటు పరిధిలో 73 వేల టీడీపీ సభ్యత్వాలు

చిత్తూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో 73 వేల టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయి. వీటిలో 33 శాశ్వత సభ్యత్వాలు, 73 వేల సాధారణ సభ్యత్వాలున్నాయి. నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు వివరాలు చూస్తే కుప్పం శాశ్వత సభ్యత్వాలు 4, సాధారణ సభ్యత్వాలు 15,920, చిత్తూరు శాశ్వత సభ్యత్వాలు 4, సాధారణ సభ్యత్వాలు 15,777, చంద్రగిరి శాశ్వత సభ్యత్వాలు 4, సాధారణ సభ్యత్వాలు 9,822 , పలమనేరు శాశ్వత సభ్యత్వం 1, సాధారణ సభ్యత్వాలు 952, పూతలపట్టు శాశ్వత సభ్యత్వాలు 9 , సాధారణ సభ్యత్వాలు 15,920, గంగాధరనెల్లూరు శాశ్వత సభ్యత్వాలు 11, సాధారణ సభ్యత్వాలు 6,240, నగరిలో సాధారణ సభ్యత్వాలు 5,882 నమోదయ్యాయి.

హెచ్‌ఎం నకీవుల్లాఖాన్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు



పుంగనూరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం నకీవుల్లాఖాన్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది.మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఏపీ ఉర్దూ అకాడమీ యేటా మైనార్టీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డే సందర్భంగా ప్రకటించే లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ఈ ఏడాది ఎం.డీ. నకీవుల్లాఖాన్‌కు దక్కింది. ఈ నెల 11న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. టిప్పుసుల్తాన్ గురువు అయిన హజ్రత్‌షా కమల్ మీద అధ్యయనం చేసినందుకు అవార్డు అందిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

చిత్తూరులో గేటు ఫ్రీ ఎన్నికల స్టంటేనా?

● ఏడు నెలలైనా మున్సిపాలిటీకి నిధులు జమ చేయని విజయానందరెడ్డి

చిత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఎన్నికల సమయంలో ఉచితమంటూ చేసిన స్టంట్ తాజాగా బయట పడింది. చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయన నియోజకవర్గంలో పండుగలకు పంపకాలు చేసేవారు. అదే క్రమంలో రెండేళ్ల పాటు చిత్తూరు నగర మార్కెట్‌లో వ్యాపారుల నుంచి గేటు వసూలు కోసం వేలం పాట దక్కించుకుని, వ్యాపారులకు మాత్రం ఉచితంగా అందించారు. ఎన్నికలకు ముందు మాత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇలాగే మున్సిపాలిటీ నిర్వహించే వేలం పాటలో హెచ్చుపాటకు దక్కించుకున్నారు. ఏడాదికి రూ.60 లక్షలు చెల్లించేలా మున్సిపాలిటీతో ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులకు మాత్రం గేటు ఫ్రీ అంటూ ఘనంగా ప్రకటించారు. టెక్నికల్‌గా ఇదంతా ఆయన పేరుతో కాకుండా ఓ అనుచరుడి పేరుతో చేశారు. విజయానందరెడ్డి వేలాన్ని దక్కించుకోవడంతో మార్కెట్‌లో వ్యాపారుల నుంచి ఎవ్వరూ గేటు వసూలు చేసేవారు కాదు. ఆయనేమో వేలం దక్కించుకుని ఏడు నెలలైనా మున్సిపాలిటీకి నిధుల్ని జమ చేయలేదు. నెలకు రూ.5 లక్షల చొప్పున ఏడు నెలలకు రూ.35 లక్షలు మున్సిపాలిటీకి నష్టం కలిగింది. వేలం పాటలో హెచ్చు పాటదారు నుంచి వెంటనే కనీసం ఓ విడత డబ్బుల్ని వసూలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో మున్సిపాలిటీకి ఈ నష్టం వాటిల్లింది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న అధికారులు ఈ విషయాన్ని గుర్తించి హెచ్చు పాటదారుడికి ఇప్పటికే రెండుసార్లు డబ్బులు కట్టాలని నోటీసులు పంపించినా స్పందన లేదు.దీంతో అప్పటి అధికారులు, సిబ్బంది మీద ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.ఎన్నికల్లో విజయానందరెడ్డి ఓడిపోవడంతో ఈ డబ్బును చెల్లించడానికి ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది.ఈ విషయమై చిత్తూరు మున్సిపాలిటీ రెవిన్యూ అధికారి వర్మను విచారించగా ఏప్రిల్‌లో జరిగిన వేలం పాట సొమ్ముకోసం పలుమార్లు నోటీసులు ఇచ్చామన్నారు.త్వరలోనే వసూలు చేస్తామన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

● ప్రియురాలికోసం వచ్చి విద్యుత్తు తీగలకు కర్ణాటకవాసి బలి





శరవణ (ఫైల్ ఫొటో) - శవాన్ని పూడ్చిపెట్టిన ప్రాంతం

కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కర్ణాటకవాసి ప్రాణాలు తీసింది. ప్రియురాలికోసం అర్ధరాత్రి అడ్డదారిలో బయలుదేరిన అతన్ని అడవిపందుల నుంచి రక్షణకోసం ఉంచిన విద్యుత్తు తీగలు కాటేశాయి. శవాన్ని చూసి భయంతో బిగుసుకుపోయిన పొలం యజమాని చేతుల్లో దిక్కుమొక్కులేని స్థితిలో భూస్థాపితమైపోయాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికుల కథనం మేరకు ...కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా దోనిమడుగు గ్రామానికి చెందిన శరవణ (40)కు, కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం కోడిగానిపల్లెకు చెందిన లలితకు సుమారు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. కాలం గడిచే క్రమంలో శరవణ భార్య సమీప బంధువు ఒకరితో సంబంధం పెట్టుకున్నాడు. అప్పుడప్పుడూ ఆమెకోసం భార్యకు తెలియకుండా అత్తవారి గ్రామమైన కోడిగానిపల్లెకు రహస్యంగా రాకపోకలు సాగించేవాడు. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీన దోనిమడుగునుంచి కారులో కోడిగానిపల్లెకు అడ్డదారిలో బయలుదేరాడు.ఊరికి కొద్ది దూరంలో కారును పార్క్ చేసి, కాలినడకన పొలాలమీదుగా గ్రామం చేరుకోవడానికి బయల్దేరాడు. కోడిగానిపల్లెకు చెందిన రామకృష్ణ పొలంలో వస్తుండగా అడవి పందులనుంచి రక్షణకోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగి విద్యుదాఘాతానికి గురైన శరవణ అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం పనుల నిమిత్తం కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న శరవణ మృతదేహాన్ని చూసి తనమీద కేసవుతుందని భయపడ్డాడు. దీంతో అతను శరవణ మృతదేహాన్ని రెండో కంటికి తెలియకుండా పొలం సమీపంలో గల పేడదిబ్బలో పూడ్చిపెట్టాడు. అయితే శరవణ ఎక్కివచ్చిన కారు గురించి మరిచిపోయాడు. గ్రామానికి సమీపంలో మూడునాలుగు రోజులుగా కారు పార్క్ చేసి ఉండడం గ్రామస్థులు గమనించారు. వారిలో కొందరు ఆ కారును తమ ఊరి అల్లుడు శరవణదిగా గుర్తించి అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కారును తీసుకొచ్చి స్టేషన్‌లో ఉంచారు. దీంతో తన నేరం ఎలాగూ బయటపడుతుందని భావించిన రామకృష్ణ శుక్రవారం పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. విద్యుత్తు తీగలు తగిలి శరవణ మృతి చెందిన విషయం వాస్తవమేనని గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. అనుమానుతుడు రామకృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం శరవణ శవాన్ని వెలికితీసి పోస్టుమార్టంకోసం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తామని చెప్పారు.

క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలి

● 'యువ తరంగ్' ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



యువతరంగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి , శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు. తిరుపతిలోని ఎస్వీయూలో శుక్రవారం ఆయన 'యువ తరంగ్-2024' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత కళాభిరుచిని పెంచుకోవడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్రీడా సాంస్కృతిక రంగాల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. ప్రాథమిక దశ నుంచే క్రీడా, సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి పెంపొందిస్తే మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవరుచుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈసీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ప్రిన్సిపాళ్లు నరసయ్య (కామర్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.

శ్రీవారి పుష్పయాగానికి అంకురార్పణ



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం నిర్వహించే పుష్పయాగానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఉదయం మూలవిరాట్టు ఎదురుగా ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే రుత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇందులో భాగంగానే సాయంత్రం శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేశారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకారసేవను టీటీడీ రద్దు చేసింది.

16 రకాల పుష్పాలతో నేడు అభిషేకం

పుష్పయాగంలో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలో రెండో అర్చన, రెండో గంట, నైవేద్యం తర్వాత ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగాన్ని నిర్వహిస్తారు. దీనికోసం టీటీడీ ఉద్యానవనం విభాగం 16 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలను సిద్ధం చేసింది. పుష్పార్చనకు, అలంకరణలకు దాదాపు 8 టన్నుల పుష్పాలను సిద్ధంగా ఉంచారు.



పనబాక లక్ష్మి | జ్యోతుల నెహ్రూ | కృష్ణమూర్తి వైద్యనాథన్ | సదాశివరావు | సౌరభ్ బోరా

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

తిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యులుగా జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సౌరభ్ బోరా, సదాశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు.అనంతరం శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న వారిని వేదపండితులు ఆశీర్వదించారు.అదనపు ఈవో శ్రీవారి చిత్రపటాలు,లడ్డూప్రసాదాలు అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం పనబాక లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. తనను టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించిన సీఎం చంద్రబాబుకు, లోకేశ్‌కు ధన్యవాదాలు అన్నారు.దేవదేవుడికి సేవ చేసుకునే అదృష్టం కలిగించిన సీఎంకు జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు.తిరుమలకు సామాన్యుడిగా, వీఐపీగా వచ్చిన సందర్భాలున్నాయన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సేవలందిస్తానన్నారు.

వేద విద్యార్థులు సనాతన ధర్మాన్ని ప్రబోధించాలి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వేద విద్యార్థులందరూ తమ కోర్సుల్లో నైపుణ్యం సాధించి సనాతన ధర్మాన్ని ప్రబోధించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. తొలిసారిగా వేదవిజ్ఞాన పీఠానికి వచ్చిన చైర్మన్‌కు ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని వేదమంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం నిర్వహించి సంప్రదాయపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో చైర్మన్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని, మరోసారి త్వరలో విద్యార్థులందరినీ కలుస్తానన్నారు. సనాతన ధర్మాన్ని మరింత ఉన్న శిఖరాలకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు. తొలుత ప్రిన్సిపాల్ తిరుమలలో వైదిక సంస్థ ఆవిర్భావం, ప్రాభవం గురించి చైర్మన్‌కు వివరించారు. అక్కడి నుంచి చైర్మన్ తిరుమలలోని గోశాలను సందర్శించారు. నవనీత సేవలో స్వయంగా పాల్గొని సేవకులు చేస్తున్న సేవలను పరిశీలించారు. ఏకాంత సేవకు వినియోగించే వెన్నను తయారు చేసే విధానాన్ని చూశారు. వెన్నను స్వయంగా తన చేతులపై సేవకులకు అందజేశారు. గోపూజలోనూ పాల్గొన్నారు. అక్కడి నుంచి పెద్దజీయర్ మఠానికి వెళ్లి పెద్దజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమాల్లో ధర్మగిరి ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఉరకలెత్తిన యువ తరంగం







స్టెప్పులేశారు. పాటలుపాడారు. శాస్త్రీయ నృత్యాభినయంతో అలరించారు. దేవతామూర్తులు, శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజాలు.. ఇలా విభిన్న వేషధారణలతో ఆకట్టుకున్నారు. కోలాటాలతో ప్రదర్శన ఇచ్చారు. చదువులోనే కాదు కళలలోనూ తమ ప్రావీణ్యాన్ని చాటారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల 'యువ తరంగ్' కార్యక్రమంలో యువోత్సాహం ఉరకలెత్తింది. శ్రీనివాస ఆడిటోరియం వేదికగా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో కళా బృందాల ర్యాలీ, ప్రదర్శన ఆకట్టుకుంది. పలు కళాశాలలకు చెందిన వేలాది మంది కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.







నేటి కార్యక్రమాలిలా..

శనివారం ఉదయం 10 నంచి యూనివర్సిటీలోని పలు కేంద్రాల్లో వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్లాస్టిక్‌రహిత తిరుపతి అంశంపై శ్రీనివాసా ఆడిటోరియంలో సామాజిక కార్యకర్త శివాజీ పలేటి ప్రసంగించనున్నారు.

– తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

అత్యవసర సేవకులకు జీతాలెక్కడ?

● నాలుగు నెలలుగా 108, 104 సిబ్బందికి అందని వేతనాలు



వేతనాలు చెల్లించాలని ఇటీవల నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేర్చి వైద్య సేవలు అందేలా చూసే 108, పల్లెవాసుల ఆరోగ్య భద్రతకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించే 104 సిబ్బంది సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా జీతాలు అందక వారు అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేసి, కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరుపతి జిల్లా పరిధిలో 108 వాహనాలు 41, 104 వాహనాలు 34 ఉన్నాయి. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది పనిచేస్తున్నారు. 108 వాహనంలో ఇద్దరు చొప్పున డ్రైవర్లు, టెక్నీషియన్లు ఉంటారు. సీనియర్ డ్రైవర్లకు నెలకు రూ.27 వేలు, జూనియర్లకు రూ.16 వేలు వేతనం ఇస్తారు. సీనియర్ టెక్నీషియన్‌కు రూ.28 వేలు, జూనియర్లకు రూ.16 వేలు ఇస్తారు. 104 వాహనంలో డ్రైవర్లకు రూ.24 వేలు, రూ.13 వేలు చొప్పున, డీఈవో(డేటా ఎంట్రీ ఆపరేటర్)లకు రూ.13వేలు చొప్పున వేతనం చెల్లిస్తారు. నాలుగు నెలలుగా జీతాలందక ఆర్థికంగా సతమతమవుతున్నారు. 102 తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేసే సిబ్బందిదీ ఇదే పరిస్థితి.

ఏనాడూ సకాలంలో అందని వేతనాలు

108, 104 వాహనాల్లో పనిచేసే సిబ్బందికి ప్రారంభం నుంచి ఏనాడూ సకాలంలో జీతాలు అందలేదు. ప్రతినెలా ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదేమని సంస్థ నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సమాధానం చెబుతున్నారని, దసరా, దీపావళి వంటి పండుగల సమయాల్లోనూ జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో, క్రెడిట్ కార్డుల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి, సకాలంలో జీతాలు అందేవిధంగా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు
పోటీలు దోహదం చేస్తాయి

● మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

● డాక్టర్ జగదీశ్‌కి గల్లా జీవితసాఫల్య పురస్కారం ప్రదానం

● ముగిసిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ 10వ వార్షికోత్సవాలు



జగదీశ్‌కి పురస్కారం ప్రదానం చేస్తున్న అరుణకుమారి

తిరుపతిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంపెనీలలో పనిచేసే ఉద్యోగుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని మాజీమంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ 10వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. క్వాలిటీ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌ని స్థాపించడంలో ప్రధాన భూమిక పోషించి, దానికి ఆర్థికంగా, సంస్థాగతంగా సహాయసహకారాలు అందించిన అమరరాజా గ్రూప్స్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు గౌరవార్థం ఆయన పేరుపై గల్లా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ జగదీశ్‌కి ఈ అవార్డును ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద సర్కిల్స్‌లో తిరుపతి చాప్టర్ ఒకటిగా ఉండడం చాలా సంతోషదాయకమన్నారు. చాప్టర్ ఆధ్వర్యంలో ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఉద్యోగుల ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని, అలాగే సంస్థల్లో క్వాలిటీ విభాగాన్ని మెరుగుపరచుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత స్థాయికి ఎదిగిన రామచంద్రనాయుడు అనేక సంస్థలను ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. అవార్డు అందించిన క్వాలిటీఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్థల నుంచి దాదాపు 2వేలమంది, 303బృందాలు హాజరయ్యాయి. వివిధ సమస్యలకు వారు కనుగొన్న పరిష్కార మార్గాలు, సాధించిన ఫలితాలను ఈ పోటీల్లో వివరించారు. 20 బృందాలకు బెస్ట్ క్వాలిటీ సర్కిల్ అవార్డులు, క్వాలిటీ సర్కిల్స్ అమలు చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన పది సంస్థలకు, నాయకత్వ ప్రతిభచాటిన 15మంది ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. అలాగే బంగారు, వెండి పతకాలను అందజేశారు. ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, అమరరాజ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ ఢిల్లీబాబు, బ్లిస్ హోటల్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాక్మెన్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ జగదీశ్, తిరుపతి చాప్టర్ చైర్మన్ జగన్‌మోహన్, జనరల్ సెక్రటరీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్తీకమాస ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలను వెల్లడించారు.

● **మహానంది-శ్రీశైలం టూర్ :** మహానంది, శ్రీశైలం నాన్ ఏసీ బస్సు ఈ నెల 16, 23 తేదీల్లో ఉదయం 9గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 6 గంటలకు తిరిగి వస్తుంది.పెద్దలకు రూ.3,300,పిల్లలకు రూ.2,540 చెల్లించాలి.

● **తలకోన టూర్ :** తలకోన, శ్రీనివాసమంగాపురానికి ప్రతి ఆది, సోమవారాల్లో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి సాయంత్రం 5గంటలకు తిరిగి వస్తుంది. ఒక్కొక్కరికి రూ.400 చెల్లించాలి.

● **గుడిమల్లం టూర్ :** రోజూ తిరుచానూరు, అప్పలాయగుంట, గుడిమల్లం మీదుగా నడుస్తుంది. ఒక్కొక్కరికి రూ.400 చెల్లించాలి.

తిరుపతి విష్ణునివాసం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాల కోసం 9848007033, 0877-2289123లను సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జనార్ధన్‌రావు, విరుపాక్ష, విష్ణుకుమార్ రాజు, క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, గాయకుడు కార్తీక్, సినీనటుడు గబ్బర్‌సింగ్ సాయి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



కార్తిక్ - సుబుదేంద్రతీర్థ స్వామి - కృష్ణమాచారి శ్రీకాంత్

సుస్థిర పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి

తిరుచానూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా మామిడి సాగులో అధిక దిగుబడి, నాణ్యతను సాధించవచ్చని రాష్ట్ర ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ హరినాథరెడ్డి తెలిపారు. తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో మామిడి విలువపై భారతీయ పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మామిడి పండించే అగ్రగామి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటన్నారు. రాష్ట్రంలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లకు, ముఖ్యంగా వాతావరణం- స్మార్ట్ టెక్నాలజీలను అవలంబించడం, పంట కోత అనంతరం నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడంలో వినూత్న పరిష్కారాలను చర్చించడానికి ఇది ఒక వేదిక అన్నారు. ఈ వేదిక రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, వ్యవసాయ సాంకేతిక నిపుణులు, ఉద్యానశాఖ, నాబర్డు, ఇతర కీలక సంస్థల ప్రతినిధులను ఒక చోట చేర్చిందని తెలిపారు. సెన్సార్ ఆధారిత వ్యవసాయం, వాతావరణ ఆధారిత వ్యవసాయం, మామిడి పంట వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, ఎగుమతి, నాణ్యత తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ చైర్మన్ పుష్పిత్‌గార్గ్, లక్ష్మీప్రసాద్, విజయవిహార, నాబార్డు ఏజీఎం సునీల్, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు, వ్యవసాయ సాంకేతిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వెండి యజ్ఞోపవీతాన్ని అందిస్తున్న దాత

వరసిద్ధుడికి కానుకగా వెండి యజ్ఞోపవీతం

ఐరాలల(కాణిపాకం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడికి వెండి యజ్ఞోపవీతంను కానుకగా హైదరాబాదుకు చెందిన అరుణనాయుడు శుక్రవారం అందించారు. ఐదు వందల గ్రాముల బరువున్న దీని విలువ రూ.50,000 ఉంటుందని సూపరింటెండెంట్ కోదండపాణి తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



దిగువమాఘంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న గల్లా జయదేవ్

తవణంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యమని అమరరాజ చైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. శుక్రవారం తవణంపల్లె మండలంలోని దిగువమాఘంలో రాజన్న ఫౌండేషన్ సౌజన్యంతో రూ.25 కోట్లు వ్యయంతో నిర్మించిన అమరరాజా స్కిల్ డెవలప్‌ఎమెంట్ సెంటర్‌ను ప్రారంభించి, ప్రసంగించారు. యువతకు ఎలక్ట్రానిక్స్, ప్లంబింగ్, ఏసీ తదితర విభాగాల్లో స్కిల్స్ అభివృద్ధి చేసి.. ప్రముఖ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించి స్థిరమైన భవిష్యత్తును, మెరుగైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడం సెంటర్ లక్ష్యమని చెప్పారు. అమరరాజ సీఈవో నరసింహులునాయుడు, సీహెచ్ఆర్ హెడ్ జైకృష్ణ, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు రాళ్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీలకు యాదమరి సిద్ధం



సాధన చేస్తున్న క్రీడాకారులు

యాదమరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫెడరేషన్ 68వ రాష్ట్రస్థాయి బాలబాలికల కుస్తీ పోటీలు శుక్ర, శని, ఆదివారాల్లో యాదమరి జడ్పీ హైస్కూల్ కేంద్రంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడల ఫెడరేషన్ కార్యదర్శి వసంతవాణి తెలిపారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, వారి శిక్షకులు గురువారమే యాదమరికి చేరుకుని, సాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఎంఈవో రుక్మిణి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటరమణ, పీడీలు రవి, హరికృష్ణ, దాము తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీనారాయణ మృతదేహం - ప్రమాదానికి గురైన కారు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దపంజాణి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన పెద్దపంజాణి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పలమనేరులోని ఓ మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అలియాస్ చరణ్(27) తన స్నేహితుడు అఫ్సర్(19)తో కలసి పుంగనూరు వెళ్ళి వస్తుండగా పెద్దపంజాణి మండలం లింగాపురం క్రాస్ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతిచెందగా అఫ్సర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కారులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. మృతుడు గంగవరం మండలం నడింపల్లెకు చెందిన వెంకట్రమణ కుమారుడు, గాయపడ్డ వ్యక్తి పలమనేరు పట్టణం రంగాపురానికి చెందిన అజ్ఘర్ కుమారుడుగా పోలీసులు గుర్తించారు. గాయపడ్డ వ్యక్తిని 108 అంబులెన్స్ సహాయంతో చిత్తూరు ఆసుపత్రికి తరలించారు.

ఏనుగుల దాడుల్లో అరటి, వరి పంటల ధ్వంసం



కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు మళ్లీ మొదలయ్యాయి. గురువారం రాత్రి కల్లూరు, మతుకువారిపల్లి పంచాయతీలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. వరి, అరటి, కొబ్బరి. వంకాయ, మామిడి తదితర పంటలను నష్టం వాటిల్లింది. ముందుగా కల్లూరు సమీపం నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు కల్లూరులోని మహమ్మద్ ఆలీ, పీఎం రఫీకి చెందిన మామిడితోటలోకి ప్రవేశించి సుమారు 75 మామిడిచెట్లను విరిచేశాయి. అనంతరం ఎద్దులవారిపల్లి, పాతపేట మీదుగా వెళ్లడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు. అనంతరం కొత్తపల్లి వద్ద మేకలవారిపల్లి రైతులు వీరప్ప, సుధాకర్‌కు చెందిన వరిపంట, వంకాయ, ఉలవ, కూరగాయల తోటలను, పైపులను ధ్వంసం చేశాయి. రెడ్డెప్పరెడ్డికి చెందిన అరటిచెట్లను ఏనుగులు తినేశాయి. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను శుక్రవారం ఉదయం ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు. ఏనుగుల గుంపు పాతపేట మీదుగా పాతపాళ్యం అడవిలోని చాకిరేవు వంకలో తిష్ట వేసినట్లు ఎఫ్‌బీఓ తెలిపారు.

రేపటి డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణ పొందేందుకోసం ఈనెల పదో తేదీన చిత్తూరులో నాలుగు ఇంజనీరింగ్ కళాశాలల్లో జరగాల్సిన స్క్రీనింగ్ పరీక్షను వాయిదా వేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లో శాసనమండలి ఎన్నికల ప్రకటన జారీచేసినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన దృష్ట్యా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

50మంది 'ఎండీయూ' ఆపరేటర్లకు జీతాల కట్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో 50మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికీ రూ.18వేలను, వారి సహాయకులకు రూ.3వేలను జీతాలుగా ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబరులో కార్డుదారులకు నిత్యావసరాలు సక్రమంగా అందించని కారణంగా 50మంది ఆపరేటర్ల జీతాలను నిలిపివేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

నేడు హౌసింగ్‌పై తిరుపతిలో మంత్రి సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో హౌసింగ్‌పై అధికారులతో సమీక్షిస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రగిరి మండలం తొండవాడ లేఅవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారు. రాత్రి తిరుమలకు చేరుకుని, ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని విజయవాడకు రోడ్డు మార్గాన వెళతారు.

వరకట్న వేధింపుల కేసులో నలుగురికి జైలుశిక్ష

నగరి/ నిండ్ర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపు కేసులో నలుగురు నిందితులకు జైలుశిక్ష విధించారు. నగరి సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. నిండ్ర మండలం ఆరూరు వడ్డిండ్లుకు చెందిన గ్రేసీని నాగలాపురం మండలానికి చెందిన వేలూరు దళితవాడకు చెందిన బద్రి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివాహానంతరం తలిదండ్రులతో కలిసి వరకట్నం తీసుకురమ్మని భార్యను వేధించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. శుక్రవారం ఈ కేసుపై నగరి జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగిన వాదోపవాదాల తర్వాత నిందితులైన బద్రి, అతడి తల్లిదండ్రులు పురుషోత్తం, అంజలి, అక్క సంగీతకు రెండున్నరేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానాను జడ్జి గోపాలకృష్ణ విధిస్తూ తీర్పు చెప్పారు.

సోమల మండల మీట్‌లో ప్రొటోకాల్ రగడ

ఉపాధి హామీ బిల్లులు ఆపేయడంతో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ఏఈని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ ప్రభాకర్ - ఎంపీడీవో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న గ్రామసభలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ ప్రభాకర్ వాపోయారు. శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు గ్రామస్థాయిలో జరిగే సమావేశాలకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంజంపేట - సోమల రోడ్డు దుస్థితితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ జిన్నా కోరారు. నడింపల్లెలోని ప్రభుత్వ పాఠశాల మూత పడడంతో ఆరేళ్లుగా పశువుల పాకగా మారిందని ఇరికిపెంట సర్పంచు రెడ్డెప్ప వాపోయారు. ప్రభుత్వ భవనం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలన్నారు. తహసీల్దార్ బెన్నురాజ్ మాట్లాడుతూ మండలంలోని శ్మశానవాటికలు ఆక్రమణలకు గురివుతున్నాయని, భూసమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, పరిష్కరించేందుకు వీఆర్వోలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు సర్పంచులను కోరినా సమస్య పరిష్కారం కాలేదని సభ దృష్టికి తెచ్చారు. వాటర్‌షెడ్ పథకంలో రూ.4 కోట్లు నిధులున్నాయని, రైతులకు ఉపయోగపడే పనులు, రాయితీ పరికరాలకు వినియోగించుకోవాలని ప్రాజెక్టు అధికారి శోభారాణి తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలకు విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారిని డాక్టర్ నీలిమా అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, ఏపీవో దినకర్‌బాబు, ఏపీఎం శివయ్య, వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ జయసింహ, సూపర్‌వైజర్ హరిత, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో మండల మీట్

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సోమల మండల సమావేశంలో ఎలాంటి వివాదాలు జరగకుండా ఉండేందుకు ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అంతర్మథనం అందరికీ అవసరం

గరికపాటి నరసింహారావు



గరికపాటిని సత్కరిస్తున్న గురజాల చెన్న కేశవులునాయుడు తదితరులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్మథనం అందరికీ అవసరమని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించనున్న యోగవాసిష్ఠం ప్రవచన కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున ఆయన ప్రవచనం చేస్తూ.. వాల్మీకి మహర్షి తన రామాయణంలో వశిష్ఠ, శ్రీరాముల నడుమ సాగే సంఘటనలను యోగవాసిష్ఠం ద్వారా తెలిపారన్నారు. 14 ఏళ్ల వయసులో శ్రీరాముడు తనలోని అంతర్మథనాన్ని వశిష్ఠుడుకి తెలియజేసి.. ఆత్మ పరిశీలన చేసుకున్న విధానమే యోగవాసిష్ఠంలో విశదపర్చారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల జగన్మోహన్ నాయుడు, సీతమ్స్ ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, నారాయణి సేవా సమితి పీఆర్వో కళ్యాణ్ చక్రవర్తి, జేడీ గోపి, నరేష్‌కుమార్‌లు గరికపాటిని సత్కరించారు.

నేడు పాఠశాలలకు సెలవు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు రెండో శనివారం కారణంగా సెలవు ప్రకటిస్తూ డీఈవో వరలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా విజయశేఖర్

చిత్తూరు అర్బన్, నవంబరు 8: చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా విజయశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ డీఎస్పీగా ఉన్న సుధాకర్‌రెడ్డిని ప్రభుత్వం వీఆర్‌కు పంపడంతో రెండు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న విజయశేఖర్‌ను నియమించింది. అలాగే ఇక్కడ డీటీసీలో ఉన్న షానుషేక్‌ను తిరుపతి పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేసింది. బదిలీ అయిన వారంతా రెండ్రోజుల్లో బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వులో పేర్కొంది.

గోకులం షెడ్ల నిర్మాణాల్లో జియో ట్యాగింగ్ తప్పనిసరి: కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణంలో మంజూరు చేసిన పనులకు జియోట్యాగింగ్ తప్పనిసరి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. 2,327 గోకులం షెడ్లు మంజూరవగా, వాటిలో 1,911కి సాంకేతిక మంజూర్లు ఇవ్వడం జరిగిందన్నారు. 1,377 జియోట్యాగింగ్ పూర్తయ్యిందని చెప్పారు. మంజూరైన పనుల్లో ఇంకా ప్రారంభించని పనుల స్థితిగతులపై ఏడీలు, ఏపీవోల నుంచి కారణాలు అడిగితెలుసుకున్నారు. వారానికి ప్రతి మండలంలో 10 నుంచి 15 షెడ్ల గ్రౌండింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డ్వామా పీడీ రవికుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను చేపట్టిన నేపథ్యంలో శని, ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి. ఓటర్ల నుంచి దరఖాస్తులను, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బీఎల్వోలు అర్జీలను స్వీకరిస్తారన్నారు. తప్పుల సవరణకు, మృతిచెందిన లేదా శాశ్వతంగా వలస వెళ్లినవారి ఓట్లను తొలగించడానికి, ముసాయిదా జాబితాలో అభ్యంతరాల సవరణకు, నూతనంగా ఓటు హక్కు పొందడానికి ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 23, 24 తేదీల్లోనూ మరోసారి ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

తూపిలిపాళెంలో ఎన్ఐవోటీ పరిశోధన కేంద్రం



తూపిలిపాళెం వాగురు వద్ద శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రవిచంద్రన్

వాకాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని తూపిలిపాళెం వాగురు వద్ద సముద్ర జలాలపై పరిశోధన కోసం ప్యాలెస్ వాటర్ ట్రీట్‌మెంట్, ఫెసిలిటీ సెంటర్‌కు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎస్ సైన్సెస్ సెక్రటరీ రవిచంద్రన్ మాట్లాడుతూ సముద్రంలోని బ్యాక్టీరియాలపై పరిశోధన కోసం ఆధునిక టెక్నాలజీలతో ఎన్ఐవోటీ ల్యాబ్‌ను ప్రారంభించామని, ఇక్కడ మైక్రోబయాలక్ కల్చర్‌పై పరిశోధన జరుగుతుందన్నారు. తమిళనాడు కేంద్రంగా ఉన్న ఎన్ఐవోటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తామని వెల్లడించారు. భూకంపం, సునామీ, తుఫాన్ వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే ఈ కేంద్రం పసిగడుతుందని, తద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. సముద్రంలో దొరికే ఖనిజాలు, కణజాలు తదితర అంశాలపై ఎన్ఐవోటీ పరిశోధన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, చీఫ్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వర్లు, డీప్ ఓషన్ మిషన్ డైరెక్టర్ ఎం. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో మైక్రోబియల్ కేంద్రానికి శంకుస్థాపన

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలం చిట్టేడులో మైక్రోబియల్ కేంద్రానికి కేంద్ర పృథ్వీ విజ్ఞానమంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.17 కోట్లతో సముద్ర మైక్రోబియల్ రిపోజిటరి కేంద్రాన్ని నిర్మించనున్నారు. దీని ద్వారా సముద్రంలో చేపలు, రొయ్యలు, జలచరాలతో పాటు మత్స్యకారులకు ఎలాంటి జల, వాయు, కాలుష్యం లేకుండా జలశుద్ధి చేస్తారని అధికారులు తెలిపారు. దీంతో మత్స్యకారులకు, చేపలకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చన్నారు. ఎన్ఐవోటీ పీఆర్‌వోలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

డీఎంకే నేత కోవై సెల్వరాజ్ కన్నుమూత

తిరుమలలో కుమారుడి వివాహ వేడుకలకు హాజరు ● తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో మృతి ● సీఎం స్టాలిన్ సహా పలువురి నేతల సంతాపం



కోవై సెల్వరాజ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ఎమ్మెల్యే, డీఎంకే ప్రచార విభాగ కార్యదర్శి కోయంబత్తూరు సెల్వరాజ్ (66) హఠాన్మరణం పాలయ్యారు.తిరుపతి సమీపంలోని తిరుచానూరులో శుక్రవారం సాయంత్రం కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన తీవ్ర గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు.సెల్వరాజ్ భౌతిక కాయానికి శనివారం కోవైలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నాడీఎంకేలో ఎమ్మెల్యేగా వ్యవహరించిన సెల్వరాజ్ ఆ పార్టీ అధినేత్రి జయలలిత మరణానంతరం జరిగిన పరిణామాల్లో డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. మంచి వాగ్ధాటి, ప్రజల్లో ఆయనకున్న ఆదరాభిమానాలను గమనించిన స్టాలిన్ డీఎంకే అధికార ప్రతినిధిగా, ప్రచార కార్యదర్శిగా నియమించారు. అప్పటి నుంచి ఆయన డీఎంకే ప్రచారానికి గట్టిగా కృషి చేస్తున్నారు. రెండు రోజుల క్రితం స్టాలిన్ కోవై పర్యటనకు వెళ్లినప్పుడు కూడా అన్నీ తానై వ్యవహరించిన సెల్వరాజ్ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేశారు. శుక్రవారం జరిగే కుమారుడి వివాహం కోసం గురువారమే కుటుంబ సభ్యులతో ఆయన తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం కుమారుడి వివాహం జరిగిన కొద్దిసేపటికే తీవ్ర గుండెపోటుకు గురయ్యారు. కుటుంబీకులు ఆయనను ఆస్పత్రికి తరలించేలోపే తుది శ్వాస విడిచారు. కాగా సెల్వరాజ్ మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు.డీఎంకే విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినప్పటి నుంచి ఎనలేని సేవ చేశారని గుర్తు చేసుకున్నారు.స్టాలిన్‌తో పాటు వివిధపార్టీల నేతలు కూడా సెల్వరాజ్ మృతికి సంతాపం తెలిపారు.

ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



ద్వారకనాథరెడ్డి - హేమాంజి

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ జి.హేమాంజి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యకు సంబంధించి ఉత్తమ ప్రిన్సిపాల్, విభాగాధిపతి, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకుల విభాగాల్లో ఉత్తమ అధ్యాపకులను ఎంపికచేసి సత్కరిస్తుంది. 2023-24 సంవత్సరానికి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా వై.ద్వారకనాథరెడ్డి, సీనియర్ అధ్యాపకుల విభాగంలో డాక్టరు జి.హేమాంజి ఎంపికయ్యారు. ఈనెల 11వ తేదీన విజయవాడలో వీరు అవార్డులను అందుకోనున్నారు.

పెద్దకొండామారిలో వైద్య శిబిరం

చౌడేపల్లె : పెద్దకొండామారిలో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద చికిత్స శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు చికిత్సలు కల్పించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సుజాత, రామచంద్రన్, ఉమేష్, అంజామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు, సవరణలకు ప్రత్యేక ప్రచారం

పలమనేరు : నియోజకవర్గంలో కొత్త ఓటర్ల నమోదు, సవరణల కోసం ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ భవాని తెలిపారు. బూత్‌లెవెల్ ఆఫీసర్లు ఆయా బూత్‌లలో అందుబాటులో వుంటారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోర్టు ఆదేశాలతో కొలువుల్లోకి ఫీల్డ్ అసిస్టెంట్లు

సదుం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సదుం మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ వివిధ ఆరోపణలతో ఉద్యోగాల నుంచి తొలగించిన ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లలోని ఆరుగురు తిరిగి ఉద్యోగాల్లో చేరేందుకు హైకోర్టు నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను ఆయన సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు అందించారు.

టీడీపీ సభ్యత్వంతో ఎన్నో సౌకర్యాలు : గౌనివారి

శాంతిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకుంటే బీమా సౌకర్యం లభిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వం చేయించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం శాంతిపురం పార్టీ కార్యాలయంలో క్లస్టర్-1, రాళ్ళబూదుగూరు కోదండరామస్వామి ఆలయంలో క్లస్టర్-2 సమావేశాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన గౌనివారి మాట్లాడుతూ సభ్యత్వం చేయించడంల కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలన్నారు. రూ100 చెల్లించి సభ్యత్వం తీసుకోవడం వల్ల రూ.10 లక్షలు ప్రమాద బీమా, రూ.5లక్షలు సాధారణ మరణ బీమాతోపాటు పలు రాయితీలు లభిస్తాయని ప్రజలకు తెలపాలన్నారు. ఎవరిని బలవంతంగా చేయించనవసరం లేదన్నారు. వారికి వారే ఇష్టపడి వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం అడిగితేనే చేయించాలన్నారు. మృతి చెందిన రోజునే అంత్యక్రియలు కోసం పది వేలు రూపాయిలు అందిస్తారని తెలపాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సలు సదుపాయం ఉంటుందని వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, ఏఎంసీ నాగరాజు, జని, మంజునాథ్‌రెడ్డి, బాలకృష్ణ, ఆర్ఎస్ మణి, గోపాల్, పెద్దన్న, నారాయణస్వామి, రుద్రప్ప, అనుసూయ, శ్యామల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

టీడీపీతోనే అభివృద్ధి

కుప్పం : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పంలోని పాతపేట, మునస్వామిపురంలో శుక్రవారం ఆయన ప్రజల నుంచి పార్టీ సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే సభ్యులుగా ఉన్న కార్యకర్తలు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాలని, కొత్తవారు సభ్యత్వం చేయించుకుని భవిష్యత్తుకు భరోసా పొందాలని పిలుపునిచ్చారు.

ప్రజాప్రయోజనాలే టీడీపీ లక్ష్యం

కల్లూరు :ప్రజాప్రయోజనాలే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు కుమార్‌రెడ్డి, గోపినాయుడు, ధనంజయనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే మూల స్తంభాలని, కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంనాయుడు, లోకేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, నవంబరు8(ఆంధ్ర జ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు. అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, నవంబర్8 :(ఆంధ్రజ్యోతి) ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వైష్ణవీదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్ రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన డిపోగా చేయడమే లక్ష్యమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం డిపోలో శుక్రవారం నూతన బస్సు సర్వీసును ఆయన పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ఆర్టీసీ డిపోను ఇప్పటికే ప్రక్షాళన చేశామన్నారు. పాత బస్సుల స్థానంలో పలు నూతన సర్వీసులను రప్పించామని, మారుమూల గ్రామాలకు సైతం కొత్తగా అదనపు సర్వీసులు కూడా వేశామని చెప్పారు. అతి త్వరలో పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తామన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులతో ప్రత్యేకంగా ఒక సదస్సు ఏర్పాటుచేసి ఆర్టీసీ సమస్యలపై వారినుంచి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుప్పం డిపోలో నూతన బస్సును ప్రారంభిస్తున్న పీఎస్ఎం తదితరులు

వైభవంగా గంగమాంబ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక అలంకరణలో గంగమాంబ, ఆలయ గోపురంపై కలశ స్థాపన, దానమయ్యగారిపల్లెలో గంగమాంబ విగ్రహ ప్రతిష్ఠ, గోపూజలో పాల్గొన్న భక్తులు

శాంతిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) 8 : మండల పరిధిలోని బడుగుమాకులపల్లెలో నిర్మించిన గంగమాంబ ఆలయంలో కుంభాభిషేక వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితులు బాలసుబ్రమణ్యం శాస్త్రి బృందం ఆధ్వర్యంలో జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత కలశ స్థాపన చేశారు. సుమారు 500 కలశాలతో గ్రామంలో ఊరేగించారు. సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వి.కోట: వి.కోట మండలం దానమయ్యగారిపల్లెలో వెలసిన గంగమాంబ ఆలయంలో శుక్రవారం తిరుపతి గంగమాంబ నూతన విగ్రహావిష్కరణ వైభవంగా జరిగింది. రెండు రోజులుగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ 108 కలశాల స్థాపన, నవగ్రహ హోమం, గణపతి పూజ, విగ్రహ స్థాపన గావించారు. శుక్రవారం ఉదయం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంబాభిషేకం జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ తదితరులు పాల్గొన్నారు.

సదుం : మండలంలోని రామాపురంలో ఇటీవల నిర్మించిన కోదండ రామాలయం ఆవరణలో వినాయక, రామలింగేశ్వర, నందీశ్వర, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. సాయంత్రం గోపూజ, పుణ్యాహవచనం, అఖండ స్థాపన, వాస్తు హోమాలు నిర్వహించినట్లు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ యువతి తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం ఉదయం పుంగనూరులో జరిగింది. ఏటవాకిలి పంచాయతీ దిగువపల్లెకు చెందిన ఆదినారాయణ కుమార్తె జ్యోతి(19) ద్విచక్రవాహనంలో పుంగనూరు వస్తూ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జ్యోతి తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారు.

సచివాలయం తనిఖీ

పెద్దపంజాణి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలంలోని లింగాపురం సచివాలయాన్ని ఎంపీడీఓ బాలాజి శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామాలలో జరుగుతున్న యూడీఐడీ కార్డుల సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూడీఐడీ కార్డులు లేని ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి వెంటనే వారికి ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్ ఫొటో, ఇతర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసి అక్కడికక్కడే వారికి కార్డు అందివ్వాలన్నారు. అనంతరం హౌస్ హోల్డ్ జియో టాగింగ్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

పెద్దకొండామారిలో వైద్య శిబిరం

చౌడేపల్లె, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకొండామారిలో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముంతాజ్ అలీ జన్మదినం సందర్భంగా ఉచిత ఆయుర్వేద చికిత్స శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు చికిత్సలు కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, రామచంద్రన్, ఉమేష్, అంజామ్, కృష్ణ, సమస్త నిర్వహకులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక

పలమనేరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 45 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేసులు మాట్లాడుతూ యువతీయువకులు తమ నైపుణ్యాలను పెంచుకొని పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జాబ్ మేళాలో మొత్తం 98 మంది నిరుద్యోగులు పాల్గొనగా అందులో 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కేసీహెచ్ సుబ్బయ్యనాయుడు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, సీడప్ అధికారి లోకేష్, ఎన్‌టీఓ పవన్‌కుమార్, హబ్‌కో ఆర్డినేటర్ సిసింద్రీ పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె - పేటూరు మార్గంలో భారీ వర్షాలతో గార్గేయ నదిపై నిర్మించిన తాత్కాలిక కల్వర్టు రెండు పర్యాయాలు కొట్టుకుపోయింది. మాజీ వైస్ ఎంపీపీ, బాలాజీ నాయుడు, టీడీపీ నేతలు వేగవంతంగా పనులు పూర్తి చేయడంతో ఏడు గ్రామాల ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయి. అలాగే గార్గేయ నది వేగంగా ప్రవహించడంతో పెద్దఉప్పరపల్లె నుంచి రెడ్డివారిపల్లె మార్గంలో ప్రయాణాలు ఆగిపోయాయి. అధికారులు స్పందించి రెడ్డివారిపల్లె మార్గంలో కల్వర్టు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు మలుపు వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం రాత్రి ముల్‌బాగల్ ఆవని పీఠాధీశ్వరులు అద్వైతానంద భారతి స్వామి ఆధ్వర్యం లో హనుమాన్ చాలీసా భక్తులకు వివరించారు. అర్చకులు రామరత్నం శాస్త్రి ఆధ్వర్యంలో హోమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ నిర్మాణ దాతలు సుబ్రమణ్యం, వెంకటరమణ భక్తులకు అన్నదాన, తీర్థప్రసాదాలు అందజేశారు.

పుంగనూరు నుంచి శైవక్షేత్రాలకు ఆర్టీసీ సర్వీసులు

పుంగనూరు రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఆర్టీసీ సర్వీసులను ఈనెల 17 నుంచి 24 తేదీ వరకు శ్రీశైలం, యాగంటి ఆలయాలకు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 1300, పిల్లలకు రూ. 700 చెల్లించాల్సి వుందన్నారు. బస్సు సర్వీసు ఆదివారం సాయంత్రం 4గంటలకు బయలు దేరుతుందన్నారు. అలాగే 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కోటిలింగాలు, బంగారు తిరుపతి, ముళబాగళ్ ఆంజనేయస్వామి, కురుడమల వినాయక స్వామి ఆలయాలకు బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిరుత దాడిలో మృతి చెందిన ఆవుకు పంచనామా

చౌడేపల్లె, నవంబర్8 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో మృతి చెందిన ఆవుకు శుక్రవారం పంచనామా నిర్వహించినట్లు పశువైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం చుక్కావారిపల్లెకు చెందిన నాగరాజ పాడి ఆవు చిరుత దాడిలో మృతి చెందిందన్నారు. ఆటవీశాఖ అధికారులతో కలసి మృతి చెందిన ఆవును పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సుబ్రహ్మణ్యం, ఎఫ్‌బీవో తదితరులు పాల్గొన్నారు.

గడ్డూరులో శ్రీరామ భజనమందిరం ప్రారంభం

బైరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డూరులో నూతనంగా నిర్మించిన రామచంద్రస్వామి భజనమందిరం శుక్రవారం ప్రారంభమైంది. అర్చకులు మురళీధరాచార్యులు శాస్త్రోక్తంగా గణపతి పూజ, వాస్తుపూజ, పుణ్యాహవచనం జరిపి రామచంద్రస్వామి చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు చౌడేపల్లె విద్యార్థులు



లక్ష్మి, చందన

చౌడేపల్లె, నవంబర్ 8 :(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు చౌడేపల్లె మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీలు ఉమాదేవి, పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఏకొత్తకోట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మి, అలాగే మర్రిమాకులపల్లె హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చందన అండర్-14 వాలీబాల్ బాలికల జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 9, 10, 11న విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎంలు వేణుగోపాల్, నాదమునినాయుడు అభినందించారు.

రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు కడపనత్తం విద్యార్థులు



బైరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు కడపనత్తం ఉన్నత పాఠశాల విద్యార్థులు బద్రీనాథ్, స్నేహ, గాయత్రి ఎంపికైనట్లు హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి, పీడీ చిరంజీవి తెలిపారు. ఈనెల 9 నుంచి 11వతేది వరకు గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక ఒకరి ఆత్మహత్య

సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన ఇర్ల గంగులప్ప కడుపు నొప్పి తాళలేక అడవి గడ్డలు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి తిరుపతి రుయా వైద్యశాలకు తీసుకెళ్లగా శుక్రవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు.

డిస్కస్ త్రో పోటీలకు నంజంపేట హైస్కూల్ విద్యార్థిని



సోమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : సోమల మండలం నంజంపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని తోట నిఖిత జాతీయ స్థాయి డిస్కస్‌త్రో పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్ఎం కుసుమాంబ తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో నిఖిత డిస్కస్ త్రో విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. పీఈటీ నూర్జహాన్, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రాజేశ్, జగన్‌మోహన్‌రెడ్డి, రమణబాబు తదితరులు విద్యార్థినిని అభినందించారు.

ఆలయానికి ఆస్తి పన్ను మినహాయించాలి



పుంగనూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్యాగరాజ స్వామి ఆలయానికి ఆస్తి పన్ను మినహాయించాలని నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు. శుక్రవారం పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన సద్గురు త్యాగరాజస్వామి ఆలయానికి మున్సిపల్ పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వెంకటేష్, హేమంత్‌కుమార్, హనుమాన్ చాలీసా పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌కు సన్మానం

పలమనేరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. పలమనేరు డిపో నుంచి బెంగళూరుకు కొత్త సర్వీసులు ప్రారంభించిన సందర్భంగా వారు డిపో మేనేజర్ స్వామికి శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల బెంగళూరుకు వారానికి నాలుగురోజుల పాటు కొత్త సర్వీసులను పలమనేరు డిపోనుంచి ప్రారంభించారు. ఈ కొత్తగా ప్రారంభించిన సర్వీసులకు కలెక్షన్లు బాగా వస్తే ప్రతి రోజూ బెంగళూరుకు సర్వీసులు నడుపుతామని మేనేజర్ పీపీఎస్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్షకార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లె, నరసింహులు, పీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు.



సంతపేట శివారులోని ఇళ్ల పక్కనే చెత్తాచెదారంతో కూడిన మురుగు

మురుగులో కాపురాలు



చిత్తూరు నగర పరిధిలోని పలు ప్రాంతాల్లోని మురుగు నిల్వ కారణంగా దోమలు, కీటకాలు స్వైరవిహారం చేస్తుండటంతో జనం జ్వరాల బారిన పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలకు కారణమయ్యే దోమలూ ఉత్పత్తి అవుతున్నాయి. నగరంలోని సంతపేట గంగమ్మగుడి వీధి, కామేశ్వరనగర్, త్యాగరాజ నగర్, సంజయ్‌గాంధీ నగర్, బాలాజీ నగర్, రామ్‌నగర్ కాలనీ, గంగనపల్లె, దొడ్డిపల్లె, గొడుగుమూరు, కట్టమంచి, ఓబనపల్లె, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో మురుగు గుంతలు ఏళ్ల తరబడి ఉన్నాయి. రామ్‌నగర్‌కాలనీ ఎక్స్‌టెన్షన్, మిట్టూరు ఎక్స్‌టెన్షన్, కాజూరు, భరత్‌నగర్, ఎం.అగ్రహారం వంటి ప్రాంతాల్లో మురుగు గుంతల సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఈ గుంతలను పూడ్చాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా.. పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

దోమల స్వైరవిహారంతో జ్వరాల బారిన స్థానికులు



మిట్టూరు ఎక్స్‌టెన్షన్‌లో ఇళ్ల మధ్య ఉన్న గుంతలో నిలిచిన మురుగు

మరుగుదొడ్లులేని కుటుంబాలను గుర్తించండి: డీపీవో



పాఠశాల వద్ద పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో పార్వతి

గంగాధరనెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా మరుగుదొడ్ల సౌకర్యంలేని కుటుంబాలను గుర్తించాలని అధికారులను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పార్వతి ఆదేశించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గంగాధరనెల్లూరుకు సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని, దళితవాడలో కాల్వలను, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ప్రతి గ్రామంలోని తాగునీటి ట్యాంక్‌లను నెలలో రెండుసార్లు క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ మనోహర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, కిరణ్ కుమార్, సింధు, కుమార్, రజని, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి: డ్వామా పీడీ

పెనుమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా మంజూరైన సిమెంటు రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని డ్వామా పీడీ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మించిన కొత్త సీసీ రోడ్లను పరిశీలించారు. క్వాలిటీ, క్యూరింగ్ విషయంలో రాజీ పడకూడదని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలిచ్చారు. బిల్లులు మంజూరుపై సిబ్బందితో చర్చించారు. శాతంబాకం, మణియానంపల్లి, జట్టిగుండ్లపల్లి, గుంటిపల్లి, రామక్రిష్టాపురంలో రోడ్లను పరిశీలించారు. మిగిలిన రోడ్లను కూడా త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లతో మాట్లాడాలని చెప్పారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, టీఏలు సతీష్, వినోద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు చరణ్, రేఖ, లోకేశ్, మురళి, మురగయ్య పాల్గొన్నారు.

దళితులను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులుండవు

● దళిత హక్కుల పోరాట సమితి



సభలో ప్రసంగిస్తున్న సుబ్బారావు

చిత్తూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితులను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులు ఉండవని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు విమర్శించారు. శుక్రవారం ఎస్టీయూ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. గత జగన్ ప్రభుత్వంలో సుమారు 27 సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో లక్షలాది మంది దళితులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు గతంలో వైసీపీ నిలిపేసిన సంక్షేమ పథకాలన్నిటినీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సమితి సభ్యులు పాల్గొన్నారు.



చినబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నేతకు సత్కారం

విజయపురం/నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు జన్మదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలాగే తిరుత్తణి, తిరుపతిలో పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను కలిసి సత్కరించారు. వీరిలో.. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, విజయపురం మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు శ్రీనివాసులు, దినేష్, సతీష్, శ్రీను, రమేష్, జగదీష్, దశరథరాజు, రాఘవరాజు, ప్రకాష్‌యాదవ్, చిన్నబ్బరాజు, మునిభాస్కర్‌రాజు, నగరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్‌నాయుడు, గుండ్రాజుకుప్పం టీడీపీ నాయకులు ఉమాపతిరాజు, ధనంజయరాజు, సుబ్రమణ్యంరాజు,చంద్రారెడ్డి, తదితరులున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు.

ఎస్‌ఆర్‌పురంలో..

శ్రీరంగరాజపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు నిరంజన్ రెడ్డి, భాస్కర్ నాయుడు, గిరి నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, వెంకటాద్రి నాయుడు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులను కోరారు. వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్లలో నియామకాలను చేపట్టకుండా మరోచోట పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని వాడుకుంటున్నారని చెప్పారు. వారిపై అదనపు పనిభారంతో ఉద్యోగులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొత్త సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు బాలాజి, చిట్టిబాబు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం : మాజీమంత్రి రోజా

నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి, వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిధి రోజా ఓ పత్రికాప్రకటనలో విమర్శించారు. మహిళలు బెల్టుషాపు నిర్వాహకుడిని పట్టివ్వడంపై స్పందించారు. హోంమంత్రి వంగలపూడి అనిత సొంత జిల్లా అనకాపల్లి మండలం తగరంపూడిలో బెల్టుషాపు నిర్వాహకుడి నుంచి 121 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా బెల్టుషాపులు లేవని చెప్పిన హోంమంత్రి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఆధార్ అప్‌డేట్‌కు కష్టాలు



వసంతాపురంలో కిక్కిరిసిన జనం

గుడిపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ కోసం జనానికి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మూడు సచివాయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 197 రామాపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో అక్కడ మార్పులు, చేర్పుల కార్యక్రమాన్ని చేయడం లేదు. పానాటూరు సచివాలయంలో ప్రింటర్ పనిచేయక పోవడంతో మండల కేంద్రమైన వసంతాపురం సచివాలయంలోనే మండలం మొత్తం ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని చేస్తున్నారు. దీంతో ఈ సచివాలయం రద్దీగా మారడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలెందుకు?

గుడిపాల మండల మీట్‌లో అధికారులపై సభ్యుల ఫైర్



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మొగిలిరెడ్డి

గుడిపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించనప్పుడు సమావేశాలు ఎందుకని గుడిపాల మండల మీట్‌లో అధికారులపై సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులు గైర్హాజరుపై నోటీసులు జారీచేసినా ఈ సమావేశానికి రాకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. పానాటూరు ఎంపీటీసీ మొగిలిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో జరిగినఅనేక సమావేశాల్లో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, ఫారెస్టు స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకున్నారని, వీఆర్‌ఏలు సక్రమంగా పనిచేయడం లేదని, పానాటూరు బస్‌స్టాప్ వద్ద రోడ్డును బాగు చేయాలని, పల్లూరు బస్‌స్టాప్ వద్ద కల్లు దుకాణాన్ని తొలగించాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. పలు సమస్యలను సర్పంచులు కూడా ప్రస్తావించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో శివరాజు, ఈవోపీఆర్డీ కృష్ణప్రసాద్, ఎస్‌ఐ రామ్మోహన్, ఏఈలు ప్రసాద్, పవన్, కరీం కాంతుల్లా, ఎంఈవో గణపతి, ఏపీఎం సుధారాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

ఓటుచెరువు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: సీపీఎం

చిత్తూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓటుచెరువు ప్రాంతంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాపోరు కార్యక్రమాన్ని ఓటు చెరువు నుంచి ప్రారంభించి, ప్రసంగించారు. ఇక్కడ చాలా మందికి రేషన్‌కార్డుల్లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని చెప్పారు. అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నేతలు సురేంద్రన్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం



చవటపల్లె యూపీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టి.చవటపల్లె టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీని కేంద్ర ప్రభుత్వ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. వైద్యసేవలపై అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, రికార్డులను పరిశీలించారు. రోగనిరోధక టీకాలు, గర్భిణులకు అందుతున్న వైద్యం, మందుల వివరాలు, ఆన్‌లైన్ నమోదు తదితరాలను పరిశీలించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోగులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కేంద్ర బృందంలో సుషీల్ కేఆర్ విమల్, రజని తోమర్, నేహా, ఎన్‌హెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, డాక్టర్ దిలీప్ తదితర అధికారులున్నారు.

భక్తి శ్రద్ధలతో స్కంద షష్ఠి మహోత్సవాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో స్కంద షష్ఠి మహోత్సవాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించాక, భక్తులకు అన్నదానం చేశారు. చర్చివీధి జీవకారుణ్య అన్నదాన సమాజం ఆధ్వర్యంలోనూ ఉత్సవాలు జరిగాయి. ఈవోలు తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి, పూల సుబ్రమణ్యం నాయుడు, మత్తుకుమరన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరిలోని కరకంఠేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న స్కంద షష్ఠి వేడుకలలో భాగంగా శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమన్యాయం అందించడమే ధ్యేయం



సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాది జగదీష్

నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమన్యాయం అందించాలన్నదే న్యాయసేవల దినోత్సవం ధ్యేయమని నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది జగదీష్ తెలిపారు. న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ ప్రసంగించగా, అధ్యాపకులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల్లేక ఇక్కట్లు

పాలసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురం, వెంగళరాజుకుప్పం, ఆముదాల పంచాయతీల కార్యదర్శులు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్తవారు ఇప్పటి వరకు రాలేదు. పాలసముద్రం మండలంలో 13 పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం ఆరుగురు కార్యదర్శులు మాత్రం విధులు నిర్వహిస్తున్నారు. పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, ఆముదాల, తిరుమలరాజుపురం, నరసింహాపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం పంచాయతీలకు కార్యదర్శులు లేకపోవడంతో ఉన్న కార్యదర్శులే అదనంగా మరో పంచాయతీకి ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. దీనివల్ల తమపై పనిభారం పడుతున్నదని కార్యదర్శులు వాపోతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు



గుడిపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. వెప్పాలమాను పంచాయతీ పిళ్లారికుప్పంకు చెందిన లోకేష్ వద్ద 28 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం

గుడిపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాసనపల్లె పరిసరప్రాంతాల్లో శుక్రవారం సారా తయారీ స్థావరాలపై గుడిపాల పోలీసులు దాడులు చేశారు. రాసనపల్లె ఫారెస్టు ప్రాంతంలో 600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు.

50 మద్యం బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

యాదమరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. మార్లబండ క్రాస్ వద్ద సుమారు రూ.6వేల విలువ చేసే 50 క్వార్టర్ బాటిళ్లను ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న శేఖర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, అతడితోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ అధికారులు

చిత్తూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం చిత్తూరు-పుత్తూరు రోడ్డులోని తూగుండ్రం క్రాస్ వద్ద దాడులు చేశారు. గంగాధర నెల్లూరు మండలం వేల్కూరుకు చెందిన యోగేశ్వర్ వద్ద 22, మురుగేష్ వద్ద మరో 20 మద్యం బాటిళ్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న గిరిజన సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి మూర్తి తెలిపారు. శుక్రవారంవెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అమరనాథ్, సర్పంచ్‌లు కావేరి, శ్రీనాథరెడ్డి హాజరయ్యారు.

హెచ్‌ఐవీపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

యాదమరి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 'మీకు తెలుసా..?' పేరుతో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, కోర్ సంస్థ నిర్వాహకులు ఎస్‌ఐ ఈశ్వర్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్ సంస్థ మేనేజర్ సద్దాం, ద్రాక్షాయణి, శెల్వి పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు

వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది సమేత ధర్మరాజులవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పూజలు చేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి హరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాపై కూటమి నేతల దాడి : వైసీపీ కన్వీనర్ ఆరోపణ



శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న విజయానందరెడ్డి తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల కారణంగా తనపై కూటమి నేతలు దాడికి పాల్పడినట్లు పూతలపట్టు వైసీపీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఐదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో అప్పట్లో టీడీపీ ఎంపీటీసీ గంగారపు గోపి ఇంటిపై శ్రీకాంత్‌రెడ్డి దాడి చేసి.. ఆస్తులను ధ్వంసం చేశారు. దీనిపై టీడీపీ నేతలు ధర్నాలు, ఫిర్యాదులు చేసినా అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గురువారం రాత్రి కూటమి నేతలు.. శ్రీకాంత్‌రెడ్డి ఇంటిపై దాడికి ప్రయత్నించారు. ఆసమయంలో ఆయన భార్య, పిల్లలు మాత్రమే ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం బెంగళూరు నుంచి పూతలపట్టుకు బయల్దేరారు. చిత్తూరుకు వస్తున్న తనపై దొరబాబు చౌదరి, మనోహర్, నరసింహులు నాయుడితోపాటు మరో 20 మంది దాడి చేశారని ఆరోపించారు. గాయపడిన తనను పోలీసులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. విషయం తెలుసుకున్న చిత్తూరు, పూతలపట్టు వైసీపీ ఇన్‌చార్జిలు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్ ఆస్పత్రికెళ్లి శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించారు. కాగా, ఈ దాడిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్/వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు అర్బన్, రూరల్, పాలసముద్రం, గుడిపాల, పెనుమూరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు మండల పరిసరాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ● ఇదే సమయంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం మండలాల్లోనూ విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ తప్పనిసరి

వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తప్పనిసరి అని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. శుక్రవారం కార్వేటినగరంలో జరుగుతున్న సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రికార్డుల తనిఖీ

వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో అమరనాథ్ తనిఖీ చేశారు. ఉద్యోగులకు సూచనలు ఇచ్చారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

వెదురుకుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు సవణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కార్వేటినగరం ఉప తహసీల్దార్ త్యాగరాజ్ తెలిపారు. శుక్రవారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశమయ్యారు. శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని బీఎల్వోలకు ఆదేశాలిచ్చారు.

రోగులకు అన్నదానం

గంగాధరనెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌సీలోని రోగులకు శుక్రవారం అన్నదానం చేశారు. డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, శైలా, హెల్త్ అసిస్టెంట్ కదిరవన్ పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముడిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీవైఈవో ప్రభాకర్‌రాజు తనిఖీలు చేశారు. టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక తరగతులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ పాఠశాల విద్యార్థిని నవ్య రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపికవడంతో ఆమెకు రూ.1,116 ప్రోత్సాహక బహుమతిని అందించారు. కాగా, డీవైఈవో అదనంగా మరో రూ.500 కలిపి ఆ విద్యార్థినికి అందించారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నేడు 'యాదమరి' సమావేశం

యాదమరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొని అన్నిశాఖల సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

దివ్యాంగులకు వైద్యసేవలు

నగరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీఆర్ కండ్రిగ వద్ద ఉన్న సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఏరియా వైద్యశాలకు చెందిన డాక్టర్ ఉషశ్రీధరమూర్తి, డాక్టర్ పూజితలు దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పాఠశాల నిర్వాహకురాలు గిరిజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.